


TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 03 | సంచిక : 143 | ఎడిటర్ : జి.రాజేష్ | మంగళవారం 18 ఆగష్టు 2026 | పేజీలు : 6 | వెల రూ. 4.00


## 36 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం

- రానున్న 3ఏళ్ళలో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తాం
- మే-2027 నాటికి శంకరగుప్తం డ్రైన్ పనులు పూర్తి కానున్నాయి
- అసెంబ్లీలో మంత్రి జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు


2లో

## రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

- రూ.80 కోట్లతో అసంపూర్తి ఎంజేపీల నిర్మాణం
- 6 బాలికల బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్
  బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణే లక్ష్యంగా అప్ గ్రేడ్
- కొత్తగా 10 బీసీ గురుకులాలు ఏర్పాటు
- సీఎస్ఆర్, డీఎంఎఫ్ ఫండ్స్ తో బీసీ హాస్టళ్ల అభివృద్ధి
- శిథిలమైన హాస్టళ్లను వేరే భవనాల్లో షిఫ్ట్ చేస్తున్నాం : మంత్రి సవిత
- రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు


- రూ.80 కోట్లతో అసంపూర్తి ఎంజేపీల నిర్మాణం
- బీసీ బాలికల డ్రా పౌట్ల నివారణే లక్ష్యంగా అప్ గ్రేడ్




అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

రూ.500 కోట్ల సాస్కి నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, మరమ్మ తులకు నిధులు కేటాయించామని తెలిపారు. వర్షా కాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన

మిగతా 2లో

## ప్రధాని మోదీతో గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు భేటీ




న్యూఢిల్లీ,ఐఎన్‌బిటైమ్స్ గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ప్రత్యేక భేటీ జరిగింది. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ప్రతిమను ప్రధాని నరేంద్ర మోదీ కి జ్ఞాపికగా అందజేశారు. సింహాచలం అప్పన్న స్వామి విశిష్టతను ప్రధానికి వివరించారు.

అశోక్ గజపతి రాజు ఆరోగ్య పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యంపై ప్రత్యేకంగా ఆరా తీసి, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు సింహాచలం శ్రీ అప్పన్న స్వామి వారిని దర్శించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. సింహాచలం వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు ప్రధాని సుముఖత వ్యక్తం చేశారు. కాగా గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లతో భేటీ కానున్నారు.

## డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు

- ఐదేళ్లు యువత జీవితాలతో చెలగాటమాడి ఇప్పుడు నీతులు చెబుతారా?
- డీఎస్సీని అడ్డుకునేందుకు 300 కోర్టు కేసులు వేసిన చరిత్ర వైకాపాదే
- దమ్ముంటే చర్చకు రండి..

ప్రతి అంశానికి ఆధారాలతో సమాధానం చెబుతాం


2లో

## ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి


2లో

-అసెంబ్లీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
-చర్చల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి
-నాదెండ్ల మనోహర్

## గిరిజనులను భయపెట్టేందుకు ప్రతిపక్షం అబద్ధపు ప్రచారం


2లో

- 1/70 చట్టం రద్దు చేస్తామనడం పూర్తిగా అవాస్తవం
- గిరిజనుల భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

- నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే
- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెర్సీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్
- సీఎం చంద్రబాబు


- నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే
- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెర్సీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్


- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం



అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ

మిగతా 2లో

## అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ బురద రాజకీయాలు

- రాష్ట్రాన్ని మళ్లీ విధ్వంసం వైపు తీసుకెళ్లాలని జగన్ చూస్తున్నారు
- ఆగస్టు 15న జాతీయ జెండా ఎందుకు ఎగురవేయలేదో జగన్ సమాధానం చెప్పాలి
- అసెంబ్లీ మీడియా పాయింట్ లో జనసేన శాసనసభ్యులు పంతం నానాజీ, ధర్మరాజు



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రం పట్ల బాధ్యత లేదు కాబట్టే వరుసగా ఏడోసారి కూడా అసెంబ్లీకి గైర్హాజరయ్యారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని, ముఖ్యమంత్రి

# అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ బురద రాజకీయాలు



చంద్రబాబుకి కేటాయించే సమయంతో సమానంగా తనకూ సమయం కేటాయిస్తేనే సభకు హాజరవుతానని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ప్రభుత్వం ఇచ్చేది కాదని, ప్రజలు ఇచ్చిన తీర్పు, శాసనసభలో పార్టీల బలాబలాల ఆధారంగా నిర్ణయించే అంశమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పనిచేసిన వ్యక్తికి ఈ విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నాయకుడికి అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బాధ్యత అని పేర్కొన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తో కలిసి సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించ లేదు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి 16 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే విమర్శలు చేయడం సరికాదు. శవం ఉందంటే ఎగురుకుంటూ వెళ్తాడు జగన్ కు దేశమంటే భక్తి, గౌరవం లేవు. అందుకే ఆగస్టు 15 న జాతీయ జెండా ఎగురవేసి వందనం చేయలేదు. శవాలు కనిపించినా, నేరాలు చేసే వారు జైళ్లో కూర్చొన్న బెంగళూరు నుంచి ఎగురుకుంటూ వెళ్లే జగన్ కు దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా వందనం చేయాలని ఎందుకు అనిపించ లేదు. జగన్ లాంటోళ్లుకు దేశంలో ఉండే హక్కు లేదు. దళితులపై దాడి చేసిన వారన్నా... బైక్ యాక్సిడెంట్ చేసి ప్రజల ప్రాణాలు తీసిన వారన్నా, యాక్సిడెంట్ కేసుల్ని తప్పుదోవ పట్టించిన వారన్నా ఎక్కడిలేని ప్రేమ చూపించే జగన్ కి అసెంబ్లీకి రావడానికి కుదరడం లేదా అంటూ వారు ప్రశ్నించారు.

## రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానాలిచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న బీసీ గురుకులాలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ బీసీ గురుకులాల భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు.ఈ ఏడాది కొత్తగా 10 బీసీ గురుకులాలు స్థాపించామని, వాటిలో 5 రాయలసీమలో, మరో 5 ఉత్తరాంధ్రలో నెలకొల్పామని తెలిపారు. ఆరు బీసీ బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత ఏపీలో 32 బీసీ గురుకులాలు మాత్రం ఉన్నాయని, 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. వాటిలో 25 ఎంజేపీలకు శాశ్వత భవనాల కోసం రూ.40 కోట్లను ఆనాడు మంజూరుచేయగా, 70 నుంచి 80 శాతం మేర పనులు సైతం పూర్తయ్యాయని అన్నారు. తరవాత వచ్చిన ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోకుండా గాలి కొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి గా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.గోనబావి, మడకశిర, రొద్దం, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో ఉన్న గురుకులాల పనులు పున:ప్రారంభించామని, త్వరలోనే వాటిని పూర్తి చేసి బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని తెలిపారు.

## యువతిని హత్య చేసిన ప్రియుడు

హైదరాబాద్,ఆగస్ట్17: హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ప్రియురాలిని ప్రియుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిపై అనుమానమే ఈ
హత్యకు కారణమని బాలాపూర్ పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందగానే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మృతురాలిని బిహార్‌కు చెందిన యువతిగా గుర్తించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో మృతురాలు పనిచేస్తోంది. మృతురాలికి ప్రేమ పేరుతో బాలాపూర్‌కు చెందిన అహ్మద్ దగ్గరయ్యాడు. ఇటీవల యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని అహ్మద్‌కు మృతురాలు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆమె గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని అతడిని బలవంతం చేసింది. దీంతో ప్రియురాలిని అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడు ప్లాన్ చేశాడు. తల్లిదండ్రులతో కలిసి యువతిని అహ్మద్ హత్య చేసినట్లు సమాచారం. నిన్న (ఆదివారం) రాత్రి మృతదేహాన్ని గోనే సంచిలో తరలిస్తుండగా స్థానికులు అనుమానించారు. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా అహ్మద్‌ను పోలీసులు పట్టుకున్నారు. అహ్మద్‌తో పాటు అతని తల్లిదండ్రులను కూడా అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ప్రస్తుతం ఉస్మానియా మార్చురీలో యువతి మృతదేహాన్ని ఉంచారు.

## హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్17 ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌కు షాక్ తగిలింది. ఈ మేరకు బోరబండ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఆమెపై కేసు నమోదు చేశారు. హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయంటూ ఫిర్యాదులో తెలిపారు. సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అనసూయకు బీజేపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'జై శ్రీరామ్' ముసుగులో కొందరు దాడులకు దిగుతున్నారంటూ అనసూయ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ పోలీస్ కేసుపై తగ్గేదేలేదని అనసూయ అంటున్నారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు.

# డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు

అమరావతి, ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ పేరుతో ఆశలు చూపి, చివరకు వారిని నట్టేట ముంచిన వైకాపాకు, నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఇప్పుడు డీఎస్సీ నియామకాలపై మాట్లాడే కనీస నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనమండలిలో డీఎస్సీపై చర్చ సందర్భంగా బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలకు మంత్రి అచ్చెన్నాయుడు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి నిరుద్యోగ యువతకు ఒక్క మెగా డీఎస్సీ కూడా ఇవ్వలేకపోయిన బొత్స సత్యనారాయణ ఈరోజు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ నీతులు మాట్లాడటం సిగ్గుచేటు. ఐదేళ్లు యువత జీవితాలతో ఆడుకున్న మీరా ఇప్పుడు నిరుద్యోగుల గురించి మాట్లాడేది? అని నిలదీశారు. 2019 నుంచి 2024 వరకు వైకాపా అధికారంలో ఉండి మెగా డీఎస్సీ ఇస్తామని నిరుద్యోగ యువతకు ఆశలు కల్పించిందని, ఆ ప్రకటనలను నమ్మి వేలాది మంది యువత అప్పులు చేసి మరీ శిక్షణ తీసుకుని, ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు చదివారని మంత్రి పేర్కొన్నారు. చివరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా వారి ఆశలను అడియాసలు చేసి, భవిష్యత్తుతో చెలగాటమాడారని మండిపడ్డారు.

నాటి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన బొత్స సత్యనారాయణ ఈ వైఫల్యానికి సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సింది చేయకుండా, ఇప్పుడు పెద్దల సభలో నిలబడి డీఎస్సీపై ప్రశ్నలు సంధించడం రాజకీయ ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు.

## నెలాఖరులోగా వెలిగొండ,పోలవరం కెనాళ్ల ప్రారంభం

అమరావతి,ఆగస్ట్14 ఆగస్టు నెలాఖరులోగా వెలిగొండ, పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాళ్లను ప్రారంభించి నీరందిస్తామని ఆంధప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు వెలిగొండ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం రూ.600 కోట్లు చెల్లిస్తామని వెల్లడించారు. గొడ్డలి పార్టీ ఐదేళ్లపాటు విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగానికి ప్రస్తుతం పునర్జీవం పోస్తూ ముందుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టులో 77 శాతం పనులు పూర్తయ్యాయని, ఆ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగానూ తీర్చిదిద్దుతామని మంత్రి నిమ్మల చెప్పారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు రివర్ బేస్డ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నీటిని ఈ నెలాఖరులోగా అనకాపల్లికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు పుష్కలంగా నీరందుతుందని మంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లు, ఇతర పారిశ్రామిక అవసరాలకు మూడు టీఎంసీల నీటిని లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా అందిస్తే సరిపోతుందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ ప్రాధాన్యంగా భావిస్తున్న 36 ప్రాజెక్టులను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తాగునీటికి మాత్రమే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి

అమరావతి,అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున జనసేన బలమైన గొంతు వినిపించాలి. అసెంబ్లీ జరిగే ప్రతి నిమిషం విలువైనదే. ప్రజలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ప్రజాప్రతినిధులుగా బాధ్యతగా సభ ముందుకు తీసుకురావాలి. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామంత్రి, జనసేన లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి తీవ్ర జ్వరం ఉండటం మూలంగా సభకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అందించే సూచనలు అనుసరిస్తూ సభా కార్యక్రమాలలో పాలుపంచుకుందాము అన్నారు. శాసనసభ వర్షకాల సమావేశాలు సోమవారం మొదలైన సందర్భంగా సభలో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ నాగబాబు తో కలిసి మనోహర్ సోమవారం అసెంబ్లీలోని జేఎల్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం దొరుకుతుంది.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకంలో సభలో జనసేన సభ్యులందరం హుందాగా, క్రమశిక్షణగా నడుచుకోవాలి. చర్చ సందర్భంగా ప్రతి విషయం మీద లోతుగా అధ్యయనం చేసి సభలో మాట్లాడాలి. అలాగే నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించేలా ప్రజల గళం కావాలి.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

(మొదటి పేజి (తరువాయి)

ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై దబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.
డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే "గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటినీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది.

## 36 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం

అమరావతి,: రానున్న మూడేళ్లలో అంటే 2029 నాటికల్లా గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో యనమదురు డ్రైన్ ఆధునీకరణ, కేశనపల్లి కెనాల్ ప్రాజెక్టు స్థితిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ మంత్రి ఈ విషయం తెలియజేశారు.గోదావరి డెల్టా లోని కాలువలు డ్రైన్లు ఆధునీకరణ కోసం 14 కోట్లు కేటాయించి లైడార్ సర్వే పూర్తి చేశామన్నారు. డిపిఆర్ కూడా తయారు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులతో చంద్రబాబు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేసినట్లు చెప్పారు. 36 ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో గోదావరి డెల్టా ఆధునీకరణ కూడా ఉందన్నారు. 2019- 24 మధ్యకాలంలో అప్పటి ప్రభుత్వం ఓ అండ్ ఎం కు నిధులు కేటాయించనందు వల్లే గోదావరి డెల్టా విధ్వంసానికి గురైంది అన్నారు. డిసిల్టింగ్, లాకులు, షట్టర్లు, రోప్స్ తదితర మరమ్మత్తుల వైపు కన్నె చూడలేదని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఈ రెండు సంవత్సరాలలో ఓఅండ్ఎం కింద 1100 కోట్లు పైగా నిధులు కేటాయించామన్నారు.
గోదావరి పశ్చిమ డెల్టాలో యనమదురు డ్రైన్ ముఖ్యమైనది. 23వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న యనమదురు డ్రైన్ కు, సామర్థ్యానికి మించి వరద వస్తోంది. యనమదురు డ్రైన్ సామర్థ్యాన్ని 30వేల క్యూసెక్కులకు పెంచడం, శిథిలావస్థకు చేరిన ఇన్లెట్లను పునర్నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వివరించారు. యనమదురు డ్రైన్ లో 86 ఇన్‌లెట్లకు గానూ 70 ఇన్‌లెట్లు శిథిలావస్థకు చేరుకున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు విడతల్లో 3.2 కోట్లు కేటాయించి, 10 ఇన్లెట్ల పునర్నిర్మిస్తున్నామని అన్నారు. యనమదురు డ్రైన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తున్నందున, ఉప్పుటేరును కూడా అభివృద్ధి చేయనున్నామన్నారు.
అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో 2686 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందించేందుకు, కేసనపల్లి కెనాల్ ప్రాజెక్ట్ కు అంచనాలు తయారు చేస్తున్నట్లు రామానాయుడు చెప్పారు.

## గిరిజనులను భయపెట్టేందుకు ప్రతిపక్షం అబద్ధపు ప్రచారం

అమరావతి ఆగష్టు,17: గిరిజనుల భూముల రక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. 1/70 చట్టాన్ని రద్దు చేస్తామంటూ ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. గిరిజనులను మభ్యపెట్టి, భయపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల భూ సంరక్షణ కోసం అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఎఅసెంబ్లీలో గిరిజనుల సమస్యలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు వినేందుకు సభకు రాకుండా బయట గిరిజనులను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమని మంత్రి ప్రశ్నించారు.

# ఆనాటి మాధవపురం.. ఈనాడు మాదాపురం.

## అంచలంచెలుగా అభివృద్ధి.



ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 17 శేర్లింగంపల్లి ప్రతినిధి: రంగారెడ్డి జిల్లాలోని మాదాపూర్ పేరును ప్రత్యేకంగా ఒక్క వ్యక్తి పెట్టలేదని స్థానిక చరిత్ర చెబుతోంది.ఈ ప్రాంతాన్ని పూర్వం మాధవ పురం అని పిలిచేవారు. కాలక్రమేణా నోటిమాటలో జరిగిన మార్పుల వల్ల అది 'మాదాపూర్'గా మారింది.పేరు వెనుక ఉన్న కథమాధవ పురం: 'మాధవుడు' అంటే శ్రీకృష్ణుడు, 'పురం' అంటే గ్రామం.భక్తి విశ్వాసాలు: పూర్వం ఈ ప్రాంతంలో నివసించే గ్రామీణులు శ్రీకృష్ణుడిని ఎక్కువగా పూజించేవారు.పేరు: అలా ఆ గ్రామానికి మాధవ పురం అని పేరు వచ్చింది. కాలక్రమేణా ఆ పేరు కాస్త వాడుకలో మారి మాదాపూర్‌గా రూపాంతరం చెందింది. 1990ల వరకు ఇది చిన్న గ్రామంగా ఉండేది. అప్పటినుండి అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.తెలంగాణ జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ముందు ఈ గ్రామం పాత రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలంలో ఉండేది.హైటెక్ సిటీ,మాదాపూర్ఐటీకి కేరాఫ్ అడ్రస్ మాదాపూర్. హైటెక్ సిటీతో పాటు పేరెన్నికగన్న ఐటీ కంపెనీలు, స్టార్‌హోటల్స్, హాస్పిటల్స్‌లు ఎన్నో మాదాపూర్‌లో ఉన్నాయి. ఐటీ, బీపీఓ హబ్‌గా ఉంది.రియాల్టీ ఇండస్ట్రీకి కనకవర్షం కురిపిస్తోంది. మన రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి నిలయమైన సైబర్ టవర్స్ మాదాపూర్‌కే తలమానికం. అంతర్జాతీయ సదస్సులకు వేదికైన హైటెక్స్ మాదాపూర్‌కు గుండెకాయలాంటిది.కళానైపుణ్యాలను మెరుగుదిద్దే శిల్పకళావేదికా ఈ ప్రాంతంలోనే ఉంది. ఐటీ, బీపీఓ దిగ్గజాలైన టీసీఎస్, మహీంద్రాసత్యం, పట్నీకంప్యూటర్స్, గూగుల్ ఇండియా, విప్రో, ఎసెంచర్, ఇన్ఫోటెక్, వ్యాల్యూ ల్యాబ్స్ కంపెనీలు మాదాపూర్ తలరాతనే మార్చేశాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో ఆసియాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా మాదాపూర్‌ను చెప్పొచ్చు.శిల్పారామం వద్ద ఋషి ప్రతిరూపం1990కి ముందు ఓ కుగ్రామంగా ఉన్న మాదాపూర్ అంటే రాళ్ళూరప్పలూ,జనసంచారం లేక పిచ్చిమొక్కలు పెరగడంతో ఈ ప్రాంతం ఒక అటవీ ప్రాంతంగా




తలపించేది. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో ఈ ప్రాంతంలో ఉండేందుకు జనం జంకేవారు. దీంతో ఓల్డ్ ముంబాయి హైవే పక్కనే ఉన్నప్పటికీ... మాదాపూర్‌కు డిమాండ్ అంతంత మాత్రమే.. అయితే హైటెక్ సిటీ రాకతో గత రెండు దశాబ్దాల్లో వేగంగా అభివృద్ధి చెంది మాదాపూర్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసింది. అంతకుముందు 20 వేల రూపాయలు కూడా పలకని ఎకరం భూమి... ప్రస్తుతం కోట్ల రూపాయలు పలుకుతోంది.ఐటీ రంగం ఈ ప్రాంతంలో ఎంత వేగంగా విస్తరించిందో అంతకు ఎన్నోరెట్లు రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి చెందింది. మౌలిక సదుపాయాలు ఒక్కసారిగా మెరుగవ్వడం, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్స్, హోటల్స్, ఐటీ కంపెనీస్ ఇలా ఒక్కటేమిటి... ప్రతి ఒక్క రంగం చూపు మాదాపూర్‌పైనే పడింది. ఎన్ని కోట్ల రూపాయలైనే గుమ్మరించి. ఇక్కడ స్థలం కొనుక్కోవడానికి అనేక సంస్థలు ఆసక్తిచూపుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో రిటైల్ భూమ్ ఒక్కసారిగా పెరిగింది.

దేశవ్యాప్తంగా రియాల్టీ రంగం నెమ్మదించినప్పటికీ నా రూటే సెపరేట్ అన్నట్టుగా ఉంది. మాదాపూర్ పరిస్థితి.




డిమాండ్ అధికంగా ఉండటంతో రియాల్టీ స్లో డౌన్ మంత్రం మాదాపూర్‌పై పనిచేయలేదు. సరికదా డిమాండ్‌ను మరింత పెంచింది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వెంచర్స్‌లో ప్లాట్స్ హాట్ కేకుల్లా అమ్ముడు పోతున్నాయి. ఈ ప్రాంతంలో స్క్వేర్ ఫీట్ 2 వేల 8 వందల నుంచి 4 వేల రూపాయలు పలుకుతోంది. పేరెన్నిక గన్న ఐటీ సంస్థలు రాంకీ, అపర్ణ, ఏలియన్స్, ల్యాంకోలు ఈ ప్రాంతంలో అతిపెద్ద ప్రాజెక్ట్‌లను, విలాసవంతమైన గృహాలను నిర్మిస్తున్నాయి. నిర్మాణం సమయంలోనే ఈ ప్రాజెక్ట్‌లోని మెజార్టీ ప్లాట్స్ బుక్ అవుతున్నాయి.

ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండటంతో మాదాపూర్‌కు డిమాండ్ అధికంగా ఉంది. ఎంఎంటీసీ ట్రైన్స్ అందుబాటులో ఉండటం. తాజాగా మెట్రోరైల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉండటంతో ట్రాన్స్‌పోర్ట్, ఇన్‌ఫ్రా రంగం ఎంతో పటిష్ఠంగా ఉంది. అలాగే ఇన్నర్, ఔటర్ రోడ్లు డెవలప్ కావడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య చాలా తక్కువగా ఉంది. దీంతో ఎక్కువ మంది ఈ ప్రాంతంలో ప్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

# సర్వే నంబర్ 145,163 నిషేధిత భూములు కావు...

**కలెక్టర్ తో జరిగిన సమావేశంలో క్లియర్ చేసిన మంత్రి...**





ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 17

ముఖ్యమంత్రి సభలో సమస్యను లేవనెత్తిన ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు..సానుకూలంగా స్పందించి పరిష్కరించిన సీఎం, రెవెన్యూ మంత్రులు... హైదర్ నగర్ తో పాటు అందరికీ దక్కిన అవకాశం... ఇకపై సమస్య కొలిక్కి వచ్చినట్టేనన్నమాధవరం కృష్ణారావు కి ప్రత్యేక ధన్యవాదాలు... మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు.

పట్టుపట్టడం.. పరిష్కరించడం..రెండు తెలిసిన రాజకీయ మేధావి.. కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలకు ఏమీ కావాలో వారి సమస్యలు ఎలా పరిష్కరించాలో తెలిసిన ఏకైక నాయకుడు.. రాజకీయ భేషజాలకు పోకుండా ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసిన వాడు అందుకే కూకట్పల్లి ప్రజానీకం ఆయనకు అండగా నిలిచింది మూడు సార్లు గెలిపించింది... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. అట్టి భూముల్లో అప్పటికే ఇల్లు కట్టుకున్నారు.. స్థలాలు కొన్నవారు నెత్తి నోరు మొత్తుకున్నా వినిపించుకోలేదు. రిజిస్ట్రేషన్లు మొదలుకొని భవన నిర్మాణ అనుమతుల వరకు అన్ని నిలిపివేసింది. దాంట్లోనే కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని హైదర్ నగర్ గ్రామ సర్వే నంబర్లు 145, 163 కూడా ఉన్నాయి. వేలాది ఇల్లులు, అపార్ట్మెంట్లు ఉన్న ఇక్కడి భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమం లో మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరిస్తాము అన్నారు. కానీ కాలేదు. ఇక 12 వ తేదీన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన సందర్భంగా ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో సభా అధ్యక్షుడిగా నేరుగా ఒకటి రెండు సమస్యలను మాత్రమే ప్రస్తావిస్తూ పరిష్కరించాలని కోరారు. అందులో మొదటిది 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న హైదర్ నగర్ గ్రామ సర్వే నంబర్ 145, 163 భూములు. దానిని ప్రభుత్వ పెద్దల దృష్టికి ప్రజల సమక్షంలో తీసుకువెళ్లడంతో ప్రభుత్వ పెద్దలు కూడా తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక తరువాయి 13 వ తేదీన అన్ని కాలనీలు సంక్షేమ సంఘాల పెద్దలతో జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వారికి పూర్తిగా సదరు సర్వే నంబర్ల లోని భూములను ఏవిధంగా వారు కొనుగోలు చేశారు గత ప్రభుత్వాలు వారికి ఏవిధంగా అనుమతులు ఇచ్చాయి అనేవి పూసగుచ్చినట్టుగా వివరించారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ సానుకూలత వ్యక్తం చేసేవిధంగా అన్ని అంశాలను వివరించారు. ఇక రెండు రోజుల సెలవు దినాలు ముగిసిన తరువాత రెవెన్యూ మంత్రి పొంగులేటితో జరిగిన కలెక్టర్ల సమావేశంలో హైదర్ నగర్ భూములపై పూర్తి స్థాయిలో కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఇక ప్రభుత్వం కూడా తాము నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై పట్టు విడిచింది. గతంలో మాదిరిగానే ఇక్కడి భూములలో రిజిస్ట్రేషన్లు భవన నిర్మాణ అనుమతులు జారీ చేసేందుకు సానుకూలత వ్యక్తం చేసింది... ఇది ముమ్మాటికి ప్రజల విజయం. కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలు ఎంచుకుని ఎన్నుకున్న నాయకుడి విజయం. మాధవరం కృష్ణారావు సాధించిపెట్టిన విజయం.. ప్రజా సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళితేనే సత్వర పరిష్కారం లభిస్తుందని భావించి అందరూ కూడా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి ప్రతిపక్షా ఎంఎల్ఏ రాడూ అనుకుంటున్న సందర్భంలో వచ్చాడు.. ప్రజల సమస్యలు మాత్రమే ప్రస్తావించాడు. వాటి పరిష్కారానికి నిలబడ్డాడు.. కలబడ్డాడు.. గెలిచాడు. ప్రజలను గెలిపించాడు.

వసంతనగర్ డివిజన్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కెపిహెచ్బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు.

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

మెదక్,ఆగస్ట్17 దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు.

# హైదరాబాద్ రన్--2026 సజావుగా నిర్వహణకు సమన్వయ సమావేశం



ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 17 సైబరాబాద్( శేరిలింగంపల్లి)

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ రన్--2026ను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం 2:30 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్ రన్--2026కు సంబంధించిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

సమావేశంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, డీసీపీ ట్రాఫిక్--× సంక్రాంతి రవి కుమార్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్--× జి. హనుమంతరావు, ఏసీపీ శ్రీ కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ అధికా రులు, ఎన్ఎండీసీ హైదరాబాద్ రన్నర్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.హైదరాబాద్ రన్--2026లో భాగంగా 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల రన్, 5 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నారు. ఈ రన్‌లు ఆగస్టు 29, 30 తేదీల్లో జరగనున్నాయి.21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమవుతాయి. 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్ల రన్‌లు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ నుంచి ప్రారంభమై, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలిలో ఉన్న జి.ఎం.సి. బాలయోగి అథ్లెటిక్ స్టేడియం వద్ద ముగుస్తాయి.సమావేశంలో రన్ మార్గాల్లో ట్రాఫిక్ నిర్వహణ, రూట్ ఏర్పాట్లు, పోలీస్ సిబ్బంది బందోబస్తు, భద్రతా చర్యలు, పాల్గొనే రన్నర్లకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు చర్చించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్, సైన్ బోర్డులు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టే అంశాలను కూడా సమీక్షించారు .హైదరాబాద్ రన్--2026ను సురక్షితంగా, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అన్ని అవసరమైన ఏర్పాట్లు చేపడుతోంది.

# వాన కోసం ఎదురుచూపు... నాగార్జునసాగర్ నీటి పైన ఆశ

**- నీరు లేక కన్నీరు అవుతున్న పల్నాడు రైతులు.**



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 17 పల్నాడు జిల్లా దిగువ ప్రాంత రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వేసిన వరి, పత్తి ,మిర పంటలు నీరు లేక ఎండిపోయే దుస్థితికి చేరుకుంది. వేలాది ఎకరాల్లో వేసిన వరి చేలు పగుళ్లు బారి రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా పచ్చగా కళకళలాడాల్సిన వరి మొక్కలు నేలలోని తేమ లేక వాడిపోతున్నాయి. పొలాలన్నీ పెద్ద పెద్ద పగుళ్లు వచ్చి ఎడారిని తలపిస్తున్నాయి. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి, విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు తీవ్ర ఆందోళనలో ఉన్నారు."వాన దేవుడా కరుణించు"

"బ్యాంకు రుణం, విత్తనాలు, ఎరువుల కోసం లక్షలు ఖర్చు పెట్టాం. ఇప్పుడు నీరు లేక పంట చేతికి రాకపోతే మా పరిస్థితి ఏంటి? అప్పులు ఎలా తీర్చాలి?" అని ఒక రైతు కన్నీరు పెట్టుకున్నాడు. మరికొందరు రైతులు చేతులు జోడించి "వాన దేవుడా మమ్మల్ని కరుణించు" అంటూ ఆకాశం వైపు చూస్తూ ప్రార్థనలు చేస్తున్నారు.జిల్లాలోని చాలా గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు ఎండిపోయాయి. కాలువలకు కూడా నీరు రాకపోవడంతో రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ప్రతి రోజు ఆకాశం వైపు చూస్తూ మేఘాల కోసం ఎదురుచూస్తున్నారు. నాగార్జునసాగర్ నీటి కోసం ఎదురుచూపులుపల్నాడు రైతులకు ఆశ అల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీరే. కానీ సాగర్ లో నీటి మట్టం తగ్గడంతో ఇప్పటివరకు కాలువలకు నీటి విడుదల చేయలేదు."సాగర్ గేట్లు ఎత్తి నీరిస్తేనే మా పంటలు బతుకుతాయి. లేదంటే ఈ ఏడాది మొత్తం చేతులు కాల్చుకున్నట్టే" అని మరో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.దిగుబడిపై తీవ్ర ప్రభావంవాతావరణ శాఖ మరో వారం రోజులు వర్షాలు ఉండవని చెప్పడంతో రైతుల ఆందోళన మరింత పెరిగింది. ఇప్పటికే 50% కంటే ఎక్కువ వరి మొక్కలు వాడిపోయాయి. వర్షం రాకపోతే ఈ ఏడాది పల్నాడులో వరి దిగుబడి 70% వరకు తగ్గిపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

## హనుమకొండ జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగష్టు 17:హనుమకొండ జిల్లాలోఃా×= -2026లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.జిల్లాలో మొత్తం 4,07,317 మంది ఓటర్లు ఉన్నారు.ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు కొత్తగా ఓటర్ నమోదుకు ఫారం-6, సవరణలకు ఫారం -8, అభ్యంతరాలకు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 19న తుది జాబితా ప్రచురించనున్నారు.

# నాళా అభివృద్ధి పనుల్లో స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 17
సోమవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీ నగర్ డివిజన్ ప్రగతి నగర్ అసోసియేషన్ సభ్యులు కోరిక మేరకు వసుంధర అపార్ట్మెంట్ వద్ద నాళా పరిశీలించారు.. ఈ సందర్భంగా నాలా అభివృద్ధి పనుల విషయమై ఆ ప్రాంతంలో ఇబ్బంది కలగకుండా చూడాలని వారు కోరగా.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని.. అలాగే మీకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుని నాళాభివృద్ధి పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## శేరిలింగంపల్లిలో ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్ఠం

ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు17 శేరిలింగంపల్లి.గౌలిదొడ్డిలో సీ అండ్ డీ వేస్ట్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌ను స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఐఏఎస్. ప్రారంభించారు.శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని గౌలిదొడ్డిలో 'రీ సస్టైనబిలిటీ' సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాల బదిలీ కేంద్రాన్ని (ట్రాన్స్ఫర్ స్టేషన్) రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఐఏఎస్ సోమవారం అధికారికంగా ప్రారంభించారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్ జి. సృజన ఐఏఎస్ , అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్ , శేరిలింగంపల్లి సర్కిల్-49 డిప్యూటీ కమిషనర్‌తో పాటు వివిధ ప్రభుత్వ అనుబంధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నగరంలో పెరుగుతున్న నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడానికి, తరలించడానికి సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ సరికొత్త సదుపాయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా శేరిలింగంపల్లి ప్రాంతాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన శాశ్వత స్థిరమైన పట్టణ ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు.పరిశుభ్రమైన, హరిత సుస్థిర శేరిలింగంపల్లి నిర్మాణంలో ఇదొక కీలకమని భావించారు.

## రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి.. రవి యాదవ్





ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 17 శేరిలింగంపల్లి: ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని రాజీవ్ గృహకల్పలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రవి యాదవ్ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవి యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల కోసం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి. షాది ముబారక్ పథకాలతో పాటు ప్రభుత్వం ఒప్పుకున్న తులం బంగారం. 2500 పింఛన్లు మంజూరు చేయలేదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ టిఆర్ఎస్ పార్టీ నాయకులు పురవీధుల గుండా తిరుగుతూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఓలా మాలలు వేసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు శశికళ. రమా. పద్మ. అనిత. నాగమణి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

### -- అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసుల సూచన





ఐ ఎన్ బి టై మ్స్ జగ్గయ్యపేట ఆగస్టు 17 :జగ్గయ్యపేట పట్నంలోని. చిల్డ్రన్స్ పార్కు పరిధిలో బుద్ధుడు బొమ్మ పరిధిలో.సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జగ్గయ్యపేట ఎస్సై రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ ఆఫర్లు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో సైబర్ నేరాలు, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్ వంటి మోసాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఆకర్షణీయమైన ఆఫర్లు కనిపించగానే నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని సూచించారు.అనుమానాస్పద లింకులు క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులకు ఒటీపీ, ప×చీ, జఎం, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వడం చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. ఆన్‌లైన్ కొనుగోళ్లలో వెబ్‌సైట్, విక్రేత వివరాలను పరిశీలించి, అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేయాలని, అలాగే »»National Cyber Crime Reporting Portalµµ (https://reference-url-citation.invalid/1) ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.
ఆర్థిక మోసాల్లో సత్వరంగా ఫిర్యాదు చేయడం ముఖ్యమని కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ వ్యవస్థ కూడా సూచిస్తోంది.ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులకు కూడా సమాచారాన్ని అందించాలని పోలీసులు కోరారు."ఆన్‌లైన్‌లో ఆఫర్ కనిపించిందని వెంటనే నమ్మొద్దు... డబ్బు పంపే ముందు ఒకసారి ఆలోచించండి. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వండి" అనే సందేశాన్ని పోలీసులు ప్రజలకు అందించారు.

# ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా చేయడమే మా లక్ష్యం.

ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు17 శేరిలింగంపల్లి: ఖాజాగూడ డీపీఎస్ . మల్కంచెరువు ప్రాంతాలలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు.సైబరాబాద్ కమ్యూనిటీకి మెరుగైన, సురక్షితమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించడమే లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్ ఐపీస్ సోమవారం ఖాజాగూడ మల్కంచెరువు ప్రాంతాలలో పర్యటించి, అక్కడి ట్రాఫిక్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ప్రతిపాదిత నూతన యూ-టర్న్ ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు.




**కీలక ఆదేశాలు. సూచనలు:**

**కొత్త యూ-టర్న్ ఏర్పాటు:**

ఖాజాగూడ డీపీస్ వద్ద ప్రస్తుతం ఉన్న పాత యూ-టర్న్‌ను పూర్తిగా మూసివేసి, దానికంటే సుమారు 70 మీటర్ల ముందుగా కొత్త యూ-టర్న్‌ను ఏర్పాటు చేయాలని అడీసీపీ ట్రాఫిక్ శేరిలింగంపల్లి ఏసీపీ మాదాపూర్ ట్రాఫిక్, స్టేషన్ హౌస్ మాస్టర్ రాయదుర్గం ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, వాహనదారులు తప్పు మార్గంలో



ప్రయాణించడాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు.

**మల్కంచెరువు హైటెన్షన్ రోడ్డు పరిశీలన:**
అనంతరం మల్కంచెరువు వెనుక వైపు ఉన్న హైటెన్షన్ రోడ్డును సందర్శించి ట్రాఫిక్ రద్దీని సమీక్షించారు. తక్కువ దూరంలోనే రెండు యూ-టర్న్‌లు ఉండటం వల్ల వాహనాల రాకపోకల్లో గందరగోళం ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుర్తించారు.



ఈ నేపథ్యంలో, అతి తక్కువ దూరంలో ఉన్న ఆ రెండు యూ-టర్న్‌లను మూసివేయాలని అధికారులను ఆదేశించారు.
రోడ్డు భద్రతను మరింత మెరుగుపరచడానికి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి వాహనాల సజావు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

# వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని,

ఏలూరు, ఆగస్టు 17 వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, డాక్టర్ ఎమ్ ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అనుసరించి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయాంకుల లక్ష్మణరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలు రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మార్పు రావాలి మార్పు కోరాలి అనే కార్యక్రమం సందర్భంగా రెండు సంఘాల ఏలూరు జిల్లా సమితుల ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వలె మన రాష్ట్రంలో కూడా 2 లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు ఇవ్వాలని, ఎలాంటి హామీలు లేకుండా కౌలు రైతులకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. పకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులకు గత మూడు సంవత్సరాల పంటల బీమా పరిహారం బకాయిల సుమారు 4400 కోట్లను వెంటనే చెల్లించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు గత రెండేళ్ల ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు 1200 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతులకు ఇస్తున్న అన్ని రైతులు కౌలు రైతులకు వర్తింపచేయాలని వారు కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులందరికీ సబ్సిడీ కి అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం 25 డిమాండ్లతో వినతి పత్రాన్ని నాయకులు కలెక్టర్ కు సమర్పించారు. రైతుల ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, రైతు మరియు కౌలు రైతు సంఘాల నాయకులు కె. ఆనందరావు, కూచిపూడి నాగేశ్వరరావు, పంతగాని తిరుపతిరావు, మల్లిపూడి రంగారావు, ఎస్ నాగార్జున రావు, కే రామకృష్ణ, చందమాల వెంకటరత్నం, మేటకట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు

ఏలూరు, ఆగస్టు 17 గ్రామీణ పేదలకు సామాజిక న్యాయం-ఆత్మగౌరవం కల్పించాలని కోరుతూ ఆగస్టు 21వ తేదీ న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు) ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలకు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య బండి వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. మార్పు రావాలి--మార్పు తేవాలి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 21న జరిగే ఆందోళన కార్యక్రమాలను మండలాలలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పేద ప్రజల సమీకరించి పెద్ద , ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు.

## ఎన్టీఆర్ జూనియర్ కాలేజీ సమస్యలను పరిష్కరించాలి డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ



ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల ఆగస్టు 17:
ఎస్ఎఫ్ఐ నాయకురాలు షేక్.జాహిద మాట్లాడుతూనందిగామ నియోజకవర్గం కంచికచర్ల మండలంలోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో 230 మంది విద్యార్థులు చదువుతున్నారు జగ్గయ్యపేట నుంచి విజయవాడ వరకు ఒక్క ప్రభుత్వ కాలేజీ కూడా లేదు ఉన్న ఒకే ఒక జూనియర్ కాలేజీ ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు సరిపడా క్లాస్ రూమ్ లేక ఇబ్బంది పడతా ఉన్నారు, జూనియర్ కాలేజీకి వచ్చే విద్యార్థులంతా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ విద్యార్థులు చదువుతున్నారు.వర్షాకాలంలో రోడ్డు బురదగా ఉంటుది.గతంలో రోడ్డుకి ఎస్టిమేషన్ కూడా వేశారు అనేకసార్లు విద్యార్థులు అధికారులకు విన్నవించుకున్న సమస్య పరిష్కారం కాలేదు కావున ఎన్టీఆర్ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపినాయక్,హుస్సేన్, వరలక్ష్మి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఫొటోకు అవార్డు పొందిన ఫోటో గ్రాఫర్ల దుర్గారావు, శ్రవణ్ కుమార్, మాచర్ల నాగేశ్వరావులను శాలువాతో సన్మానం చేసిన టిడబ్ల్యూజెఎఫ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య




ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు17
శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ కాలనీలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్-2026లో కూకట్పల్లి ఫోటో జర్నలిజం ప్రతిభ చూపిన దక్కన్ క్రానికల్ ఫోటో జర్నలిస్ట్ దుర్గారావు, నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరావుకి రాష్ట్ర స్థాయి అవార్డులు వరించిన సందర్భంగా సోమవారం రోజు కూకట్పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) నాగుల అంజిబాబు అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు యాకయ్య మాట్లాడుతూ పుట్ పాతుల మీద విధి వ్యాపారుల బ్రతుకులనూ ఎత్తిచూపుతూ తీసిన ఫొటోలకు ఈ గుర్తింపు లభించిందని, ప్రజా సమస్యలను బ్రతుకు చిత్రాలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి సీనియర్ జర్నలిస్ట్ రామారావు, సూర్య దినపత్రిక ఫోటో జర్నలిస్ట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.